## నేటి నుంచి ఛాయాచిత్ర ప్రదర్శన

ఖలీల్‌వాడి, అక్టోబర్ 27 : కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, ఫీల్డ్ ఆఫీస్ –నిజామాబాద్ ఆధ్వర్యంలో నేడు (సోమవారం)ఉదయం 10.30 గంటలకు ఏక్‌భారత్ – శ్రేష్ఠ భారత్‌పై ఛాయాచిత్ర ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల –ఆర్మూర్‌లో రెండు రోజుల పాటు ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఆర్మూర్ ఎమ్మెల్యే, ఆర్డీవో, మున్సిపల్ కమిసనర్, ఎన్‌వైకే యూత్ ఆఫీసర్, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు.

## నేటి నుంచి తపాలాశాఖ విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

ఖలీల్‌వాడి, అక్టోబర్ 27 : తపాలా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి నవంబర్2వ తేదీ వరకు విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ జనార్దన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 28న సమగ్ర ప్రతిజ్ఞ, 29న బ్యానర్లు, పోస్టల్ ప్రదర్శన, 30న ఉద్యోగుల కోసం డెబిట్లు, 31న అవినీతి వ్యతిరేక కార్యక్రమాలు, నవంబర్ 1న అవగాహన సభ, 2న సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

## నవంబర్ 23న జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీ

సిరికొండ, అక్టోబర్ 27 : మండలంలోని కొండాపూర్‌లో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నవంబర్ 23న నిర్వహించనున్నట్లు కొండాపూర్ యువజన నాయకులు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు నవంబర్ ఒకటో తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. విన్నర్‌కు రూ. 10 వేలు, రన్నర్‌కు రూ. 5 వేల నగదు బహుమతి అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

## పోలీసుల కళాజాత

ధర్పల్లి, అక్టోబర్ 27 : విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసుల త్యాగం మరువలేనిదని ధర్పల్లి సీఐ భిక్షపతి అన్నారు. మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద పోలీసు కళాజాత బృందం ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. కళాశాత బృందం సభ్యులు నృత్యాలు, ఆటపాటలతో పోలీసుల విధులు, వారి త్యాగాలు తదితర అంశాలపై ఆటపాటల రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రాజ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## జెనిటిక్ డిసార్డర్స్‌పై అవగాహన సదస్సు



లయన్స్ సహారా, శ్రీ ధన్వంతరి మెడికల్ సెంటర్, సూర్య హెల్త్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు

ఖలీల్‌వాడి, అక్టోబర్ 27 : లయన్స్ సహారా, శ్రీ ధన్వంతరి మెడికల్ సెంటర్, సూర్య హెల్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జెనిటిక్ డిసార్డర్‌పై నగరంలోని సహారా కార్యాలయంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హైదరాబాద్ వైద్యులు గాయత్రి, ప్రశాంత్, జ్యోత్స్న హాజరై.. జెనిటిక్ డిసార్డర్‌పై వివరించారు. సదస్సులో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ విజయానంద్, కార్యదర్శి ధనుంజయ్, రామారావు, ఉదయ్ సూర్యభగవాన్, పోశెట్టి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# దళారుల చేతుల్లో పటాకుల దందా

- జిల్లాకు చేరిన నకిలీ పటాకులు
- అనుమతులు లేకుండానే విక్రయాలు
- వ్యాపార సముదాయాల మధ్య వెలిసిన దుకాణాలు
- పట్టించుకోని అధికారులు



ఖలీల్‌వాడి, అక్టోబర్ 27: దీపావళి సందర్భంగా జిల్లాలో నకిలీ పటాకులు విక్రయించేందుకు దళారులు తెరలేపారు. అనుమతులు లేకుండానే దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఖాళీ ప్రదేశాల్లో దుకాణాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా.. వ్యాపార సముదాయాల్లోనే ఏర్పాటు చేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గతేడాది మిగిలిన పటాకులను సైతం ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాకేంద్రంలోని నిత్యం రద్దీగా ఉండే గంజ్ ప్రాంతంలో పటాకుల దుకాణాలు ఏర్పాటుచేశారు. చుట్టూ నిత్యావసర సరుకులు విక్రయించే దుకాణాల మధ్య పటాకులు విక్రయించడం ఎంతవరకు సబబు అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ దుకాణాలు నిర్వహిస్తున్న వారిలో కొందరు అధికారులు, బడా నాయకులు ఉన్నట్లు సమాచారం.

**అధికారుల పేరు చెప్పి వసూళ్లు**

దుకాణాల లైసెన్సు ఇప్పిస్తామంటూ దళారులు అక్రమ మార్గంలో వెళ్తున్నారు. అధికారులతో మాట్లాడి, తాత్కాలిక లైసెన్స్‌లు ఇప్పిస్తామంటూ ఒక్కొక్కరి నుంచి రూ.10 వేల నుంచి రూ.15వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. పర్మినెంట్ లైసెన్సులు ఐదారుగురు హోల్‌సేల్ వ్యాపారులకు మాత్రమే ఉన్నాయి. రిటైల్ వ్యాపారులు పండుగ సమయంలో పటాకులు విక్రయించేందుకు తాత్కాలిక అనుమతి (15 రోజుల కోసం) అగ్నిమాపక శాఖ, పోలీసుశాఖ, మున్సిపాలిటీ నుంచి తీసుకోవాల్సి ఉంటుంది. తాత్కాలిక లైసెన్స్‌ల కోసం దీపావళి పండుగకు ముందు నుంచే డిమాండ్ ఏర్పడింది. తాత్కాలిక అనుమతి ఉన్న వారికే హోల్‌సేల్ వ్యాపారులు పటాకులు విక్రయిస్తున్నారు. వీరు నివాస ప్రాంతాలకు దూరంగా క్రీడామైదానాలు లేదా ఖాళీ ప్రదేశంలో పటాకులు విక్రయించేందుకు ప్రభుత్వం అనుమతించాల్సి ఉంటుంది. అనుమతులు ఇచ్చే ప్రక్రియను అధికార యంత్రాంగం ప్రారంభించక ముందు నుంచే లైసెన్స్‌ల కోసం దళారులు వసూళ్లు ప్రారంభించారు. తమ వద్దకు వచ్చే రిటైల్ వ్యాపారుల నుంచి అనుమతుల కోసం అంటూ హోల్‌సేల్ వ్యాపారులు డబ్బులు వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లాకేంద్రంతోపాటు ఆర్మూర్‌లో కొందరు రాజకీయ నాయకుల వసూళ్ల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. అనుమతులు ఇవ్వలేదని అగ్నిమాపక శాఖాధికారులు చెప్పినా కూడా లక్కీడ్రా ద్వారా ఇప్పిస్తామంటూ కొందరు వసూళ్లు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

**అధిక ధరలకు విక్రయం..**

జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాల్లో పటాకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. అధిక ధరకు పటాకులు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతేడాది అమ్ముడుపోని పాత, నకిలీ పటాకులకు కొత్త లేబుల్స్ వేసి మోసం చేస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

**వీరికి ఎవరు అనుమతి ఇచ్చారు..?**



జిల్లా కేంద్రంలోని గంజ్ ప్రాంతంలో ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో పటాకుల దుకాణాలు ఏర్పాటు చేశారు. ఈ దుకాణాల్లో ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. ఈ దుకాణాలకు ఎందుకు అనుమతి ఇచ్చారు? అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలి.

**-రమేశ్ బాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి**

## రాంపూర్ మాజీ ఎంపీటీసీ మృతి

డిచ్‌పల్లి, అక్టోబర్ 27 : మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ మోతె భూమన్న ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఆర్టీసీ మాజీ చైర్మన్, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్.. మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్‌తో కలిసి అంత్యక్రియల్లో పాల్గొని, పాడె మోశారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి, ఓదార్చారు. అంత్యక్రియల్లో పాల్గొన్న వారిలో బీఆర్‌ఎస్ నాయకులు శేఖర్, కృష్ణ, నల్లవెల్లి సాయిలు, గోపు చిన్నన్న, ఒడ్డెం నర్సయ్య, పద్మారావు, అంజయ్య, కుమార్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

**అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోసిన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్**


పాడె మోస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్, వీజీగౌడ్

## మెగా ఉచిత వైద్యశిబిరం

మోపాల్ (ఖలీల్‌వాడి), అక్టోబర్ 27 : మండలంలోని కులాస్‌పూర్ గ్రామంలో శ్రీ సిగ్మా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సుమారు 300 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా దవాఖాన ప్రతినిధి గడీల శ్రీరాములు మాట్లాడుతూ.. నూతనంగా ప్రారంభించిన సిగ్మా హాస్పిటల్ ఆధ్వర్యంలో సేవలందించేందుకు శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, వీడీసీ చైర్మన్ నారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డి, నాగరాజుగౌడ్, కార్డియాలజిస్ట్ డాక్టర్ దిలీప్, న్యూరోసర్జన్ చక్రవర్తి, ఎమర్జెన్సీ, క్రిటికల్ కేర్ డాక్టర్ వెన్నెల, అసిస్టెంట్ ప్రొఫెసర్ జనరల్ సర్జన్ డాక్టర్ పారాస్ జైన్, నర్సింగ్ సూపరింటెండెంట్, లిల్లీ, మాధవ్, రవి, శ్రీధర్, సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు అభినందన


క్రీడాకారిణిని అభినందిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

వినాయక్‌నగర్, అక్టోబర్ 27 : అంతర్జాతీయ స్థాయిలో రాణించిన పలువురు క్రీడాకారులను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం అభినందించారు. జార్జియా దేశంలోని బాటుమిలో ఇటీవల నిర్వహించిన ఓపెన్ ఇంటర్నేషనల్ ఉషూ టోర్నమెంట్‌లో సబ్ జూనియర్, జూనియర్ కేటగిరీలో సిల్వర్, బ్రౌన్‌మెడల్స్ సాధించిన ఆకాంక్ష యాదవ్, ఫారియా ఖాన్, సాయిదీక్షిత్‌ను అభినందించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఇందూరు క్రీడాకారులు రాణించడం సంతోషంగా ఉందన్నారు.

## రుద్రూర్ టు శబరిమల పాదయాత్ర


పాదయాత్రలో పాల్గొన్న మాలధారులు

రుద్రూర్, అక్టోబర్ 27 : 41 రోజులు మండలదీక్ష చేపట్టిన అయ్యప్ప మాలధారులు రుద్రూర్ నుంచి శబరిమల వరకు ఆదివారం పాదయాత్రగా బయల్దేరి వెళ్లారు. బయల్దేరిన వారిలో మాలధారులు ప్రసూన్ స్వామి, గాండ్ల సుభాష్ స్వామి, జువ్వల శ్రావణ్ స్వామి, భూపతి స్వామి, రాజు స్వామి తదితరులు ఉన్నారు.

## సంస్కృతికి ప్రతీక కుటుంబం

సుభాష్‌నగర్, అక్టోబర్ 27 : భారతీయ సంస్కృతికి ఆధారం కుటుంబవ్యవస్థ అని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రతినిధి డాక్టర్ కాపర్తి గురుచరణం అన్నారు. గుండారం శివారులో అనంతగిరి అనంత పద్మనాభస్వామి ఆలయ ప్రాంగణంలో ఆర్‌ఎస్‌ఎస్ శ్రీనీలకంఠేశ్వర ఉద్యోగి ప్రభాత్ శాఖ ఆధ్వర్యంలో కుటుంబ మిలన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ఎస్ ప్రారంభమై 100 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. రామాయణ, మహాభారత ప్రశ్నలతో క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ఇందూరు విభాగ్ ప్రతినిధి వి.శ్రీనివాస్, గ్రామీణ వికాస ప్రాంత ప్రతినిధి వేంపల్లి ప్రతాప్, శాఖ ప్రతినిధి నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## వృద్ధురాలి చైన్‌స్నాచింగ్ కేసులో సీసీ ఫుటేజీల సేకరణ

- నిందితుడు హైదరాబాద్ వైపు పారిపోయినట్లు గుర్తింపు

వినాయక్‌నగర్, అక్టోబర్ 27 : జిల్లాకేంద్రంలోని వినాయక్‌నగర్‌లో శనివారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వృద్ధురాలి బంగారు గొలుసును దుండగుడు చోరీ చేసిన విషయం తెలిసిందే. బాధితురాలు చెప్పిన ఆనవాళ్ల ప్రకారం.. చోరీ జరిగిన సమయంలో పలు సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. ఆ ఏరియాలో అనుమానాస్పదంగా తిరిగిన ద్విచక్రవాహనాల కదలికలను గుర్తించారు. చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన నిందితుడు నంబర్‌లేని పల్సర్ బైక్‌పై ఒక్కడే వచ్చి చోరీకి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. నిందితుడు హైదరాబాద్ వైపు పారిపోయినట్లు పోలీసుల దర్యాప్తులో తేలినట్లు సమాచారం. దుండగుడిని పట్టుకునేందుకు ప్రత్యేక టీమును ఏర్పాటు చేసి, హైదరాబాద్‌కు పంపేపనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. 13న నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన మరో చైన్ స్నాచింగ్ కేసులో ఎలాంటి పురోగతీ లేదు. ఈ కేసుతోపాటు వృద్ధురాలి నుంచి చైన్ తెంచుకుని పారిపోయిన ఘటనకు పాల్పడిన నిందితులకు ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో సైతం పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

## నాటక రంగానికి పూర్వవైభవం తీసుకురావాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీపాదకుమార శర్మ

సుభాష్‌నగర్, అక్టోబర్ 27 : కనుమరుగవుతున్న నాటకరంగానికి తిరిగి పూర్వవైభవం తీసుకవచ్చేందుకు, భావితరాలకు నాటకరంగాన్ని పరిచయం చేసి కాపాడుకోవాలని నాటకప్రయోక్త శ్రీపాద కుమారశర్మ అన్నారు. రైల్వేస్టేషన్ రోడ్‌లోని గీతాభవనంలో జిల్లా కేంద్రానికి చెందిన నాటక రంగ కళాకారుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన రంగస్థల నాటక రంగాన్ని విశ్వవ్యాప్తం చేసిన కీర్తి ఇందూరుకు ఉన్నదన్నారు. త్వరలోనే నాటక రంగస్థల సంస్థల ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో స్నేహమయి ప్రకాశ్, చిరంజీవాచార్యులు, సాయన్న, మంతెన రాజేశ్వర్, కళాధర్, సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ల అప్పగింత


సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్సై రాము

సిరికొండ, అక్టోబర్ 27 : మండలంలోని తాళ్ల రామడుగు గ్రామానికి చెందిన బోదాసు రమేశ్, రావుట్లకు చెందిన అశోక్, గడ్కోల్‌కు చెందిన శరత్‌బాబు తమ ఫోన్లను ఇటీవల పోగొట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో వెంటనే ఫిర్యాదు చేయగా.. పోలీసులు సీఈఐఆర్ పోర్టర్ ద్వారా ఫోన్ల ఆచూకీని గుర్తించారు. బాధితులకు సిరికొండ ఎస్సై రాము ఫోన్లను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రాకేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

## స్నేహితుడికి ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న స్నేహితులు

వేల్పూర్, అక్టోబర్ 27: మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితుడికి పదో తరగతి 1996–1997 బ్యాచ్ స్నేహితులు రూ.51వేల ఆర్థిక సాయం అందజేశారు. వైద్య ఖర్చుల నిమిత్తం వీటిని అందజేశామని వారు తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి

వేల్పూర్, అక్టోబర్ 27: మండల కేంద్రంలో ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పించడానికి కొనుగోలు కేంద్రం ప్రారంభించామన్నారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నర్సారెడ్డి, డైరెక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
WANTED
★ ఉత్తర తిరుపతిక్షేత్రం గంగాస్థాన్-II నిజామాబాద్ కళ్యాణ మండపంలో 1) మేనేజర్‌గా Male అర్హత: డిగ్రీ, సాలరీ 15,000/-Month మరియు 2) ఎలక్ట్రిషన్ కం ప్లంబర్ (అర్హత: డిప్లమా ఎలక్ట్రిషన్, సాలరీ 14,000/-Month ఆసక్తిగలవారు. ఆధార్, ఫోటో, స్టడి సర్టిఫికేట్స్‌తో క్రింది అడ్రసుకి సంప్రదించండి.
అనఘా షాపింగ్‌మాల్, ఆర్.పి.రోడ్, నిజామాబాద్.
NTZ-334492
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు


మాట్లాడుతున్న సీనియర్ చరిత్రకారుడు యాదవరావు

బోధన్, అక్టోబర్ 27: పట్టణంలోని శక్కర్‌నగర్ రామమందిరంలో ఆదివారం నాదబ్రహ్మ త్యాగరాజ ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. బోధన్‌లో సంగీత ఉపాధ్యాయుడు ప్రతాప అన్నపూర్ణ రామకృష్ణయ్య దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబీకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉదయం ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వక్తలు మాట్లాడుతూ సంగీత కార్యక్రమాలు మరిచిపోతున్న నేటి రోజుల్లో వాటి ప్రాధాన్యతను వివరించే విధంగా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ముఖ్య అతిథులు, విశిష్ట అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో బోధన్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ శేషతల్పసాయి, పట్టణ సీఐ వెంకట నారాయణ, ప్రముఖులు కందకుర్తి యాదవరావు, రాకేశ్ వైద్య, కాసర్ల నరేశ్, సంగీతాచార్యులు స్వప్నరాణి, నిర్వాహకులు ప్రతాప గౌరీ శంకరశాస్త్రి, ప్రతాప సత్య సాయిబాబా, కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ భవనాన్ని పూర్తి చేస్తాం


వివరాలను తెలుసుకుంటున్న జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్

నవీపేట, అక్టోబర్ 27: మండల కేంద్రంలో కొన్ని రోజుల నుంచి అసంపూర్తిగా ఉన్న మొదటి అంతస్తు గ్రంథాలయ భవన నిర్మాణ పనులను పూర్తి చేయిస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న భవనం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పాఠకులకు అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని అన్నారు. తనిఖీ సమయంలో గ్రంథపాలకుడు సందీప్ అందుబాటులో లేకపోవడంతో చైర్మన్ అసహనానికి లోనయ్యారు. జిల్లా వ్యాప్తంగా అవుట్ సోర్సింగ్‌పై పనిచేస్తున్న గ్రంథపాలకులు తప్పకుండా సమయపాలన పాటించాలని సూచించారు. ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

రెంజల్,అక్టోబర్ 27: మండలంలోని కందకుర్తి గ్రామానికి చెందిన సాహేబ్‌రావు(38) చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఈనెల 24న మహారాష్ట్రలోని నాగ్‌ఠాణా గ్రామంలో అత్తగారింటికి బైక్ పై వెళ్తున్నాడు. పిప్పల్‌గాం పాఠా వద్ద బైక్ అదుపు తప్పి పడిన ఘటనలో తల, కాలు తీవ్ర గాయాలయ్యాయి. నిజామాబాద్‌లోని దవాఖానలో మూడు రోజులుగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

## రహదారిపై నకిలీ కరెన్సీ నోట్లు

వేల్పూర్ అక్టోబర్ 27: మండలంలోని అంక్సాపూర్ వద్ద జాతీయ రహదారి 63పై నకిలీ నోట్ల ఘటన ఆదివారం కలకలం రేపింది. రహదారిపై రూ.100, రూ.500 నోట్లు రహదారిపై కనిపించడంతో వాహనదారులు ఎగబడి తీసుకున్నారు. తీరా నోట్లపై ముద్రను పరిశీలించగా స్కూల్ పిల్లల ప్రాజెక్టు వర్క్ కోసం మాత్రమే అని ప్రింట్ చేసి ఉండడాన్ని చూసి జనం కంగుతిన్నారు. వీటిని ఎవరైనా రోడ్డుపై పడేసి ఉంటారని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

## పటాకుల విక్రయదారులు అనుమతి పొందాలి



సూచనలు చేస్తున్న ఏసీపీ శ్రీనివాస్

శక్కర్‌నగర్, అక్టోబర్ 27: బోధన్ పట్టణంలో పటాకుల విక్రయ కేంద్రాల వారు తప్పనిసరిగా అనుమతులు పొందాలని ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. ఆదివారం బోధన్ పోలీస్ స్టేషన్‌లో పటాకుల విక్రయ కేంద్రాల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. దుకాణదారులు అగ్నిమాపక, రెవెన్యూ, పోలీసుశాఖ అనుమతితో పాటు ముందుగా, దుకాణం ఏర్పాటుకు స్థలం కోసం జూనియర్ కళాశాల నుంచి అనుమతి పొందాలని అన్నారు. ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో పట్టణ సీఐ వెంకట నారాయణ, ఎస్సై హబీబ్ ఖాన్ పాల్గొన్నారు.

## అన్ని డీఏలూ విడుదల చేయాలి

భీమ్‌గల్, అక్టోబర్ 27: ఐదు కరువు భత్యం (డీఏ)లు పెండింగ్‌లో ఉండగా ప్రస్తుతం ఒక్క డీఏను మాత్రమే విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంపై టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్కా జనార్దన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన భీమ్‌గల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జీవో 317 సమస్యలపై దాటవేత వైఖరిపై రాష్ట్రంలోని ఉపాధ్యాయులంతా తీవ్రంగా నిరసిస్తున్నారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన పదిహేను రోజుల్లో మూడు పెండింగ్ డీఏ విడుదల చేస్తామని, పెండింగ్ బిల్లులు విడుదల చేస్తామని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని, జీవో 317 బాధితులందరికీ న్యాయం చేస్తామని కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పేర్కొందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని పది నెలలుగా ప్రభుత్వంపై ఒత్తిడి చేయకుండా ఓపిక పట్టామన్నారు. కానీ ప్రభుత్వం ఒక డీఏను మాత్రమే విడుదల చేయాలని కేబినెట్ మీటింగ్‌లో నిర్ణయించడం సరికాదన్నారు. డీఏతోపాటు జీవో 317 సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని, ఇతర సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## నిధుల మంజూరుపై హర్షం

మోర్తాడ్, అక్టోబర్ 27: కమ్మర్‌పల్లి మండలంలోని కమ్మర్‌పల్లి, కోనాసముందర్ గ్రామాల సొసైటీ గోడౌన్ల నిర్మాణానికి తన సొంత నిధులు రాకున్నా రాజ్యసభసభ్యుడు సంతోష్‌కుమార్ ద్వారా నిధులు మంజూరు చేయించిన బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, కమ్మర్‌పల్లి సొసైటీ చైర్మన్ రేగుంట దేవేందర్ ఆదివారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఎమ్మెల్యే కమ్మర్‌పల్లి సొసైటీ గోడౌన్‌కోసం రూ.20లక్షలు మంజూరు చేసినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని రద్దు చేసిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వేముల స్పందించి రాజ్యసభసభ్యుడి నుంచి నిధులు ఇప్పించారని కొనియాడారు.

## కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

నవీపేట, అక్టోబర్ 27: మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, జన వికాస్ సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు తెడ్డు పోశెట్టి ఆదివారం ఒక ప్రకటలో డిమాండ్ చేశారు. బినోలా, నవీపేట, నాగేపూర్‌లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

బోధన్ రూరల్, అక్టోబర్ 27: బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామ శివారులో పేకాడుతున్న ముగ్గురిని బోధన్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై మచ్చేందర్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఆదివారం ఉదయం దాడులు నిర్వహించారు. పేకాడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.7520 స్వాధీనం చేసుకున్నారు.

## పోస్టర్ల ఆవిష్కరణ

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్27: నవంబర్ 9న నిర్వహించనున్న డీవీకే విగ్రహావిష్కరణ కార్యక్రమ పోస్టర్లను ఆదివారం పట్టణంలోని సీపీఎంఎల్ కార్యాలయం ఆవరణలో సీపీఐఎంఎల్ ప్రజాపంథా మాస్ లైన్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల కుటుంబాలను ఆదుకోవాలి

మోర్తాడ్, అక్టోబర్ 27: తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలను ఆదుకోవాలని మండల ఉద్యమకారుల కమిటీ సభ్యులు కోరారు. ఆదివారం మోర్తాడ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఉద్యమకారులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉచిత బస్సుపాస్‌లు, ఇంటిస్థలాలు ఇవ్వాలని, ఉద్యమకారులకు పింఛను సౌకర్యం కల్పించాలని కోరారు. సమావేశంలో ఉద్యమ కారుల సంఘం మండల అధ్యక్షుడు నర్సయ్య, దశరథ్, బాబూరావు, గంగాధర్, రాజారాం తదితరులు పాల్గొన్నారు.


ముప్కాల్‌లో సమావేశమైన 1995–96 బ్యాచ్ విద్యార్థులు


బాల్కొండలో సమావేశమైన 2005–2006 బ్యాచ్ విద్యార్థులు

**ముప్కాల్ మండలంలోని రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో** చదివిన 1995–96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఆత్మీయ సమ్మేళనంలో ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుంటూ ఆనందంగా గడిపారు. పూర్వ ఉపాధ్యాయులను సన్మానించారు. బాల్కొండ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జడ్పీహెచ్‌ఎస్ 2005–2006 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.
**– ముప్కాల్/బాల్కొండ, అక్టోబర్ 27**

## ఉపాధిహామీ పనులను గుర్తించాలి

ఏర్గట్ల, అక్టోబర్ 27: ఈ ఏడాది చేపట్టాల్సిన ఉపాధి హామీ పనులను గుర్తించాలని ఏపీవో వెంకటేశ్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. బట్టాపూర్, దోంచంద గ్రామాల్లో ఇప్పటికే పనులు గుర్తించినట్లు తెలిపారు. మండలంలోని మిగితా గ్రామాల్లో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి పనులు గుర్తించి రికార్డు చేయాలని గ్రామ పంచాయతీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.

## రిటైర్డ్ పోస్ట్‌మన్‌కు సన్మానం

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్27: ఆర్మూర్ పోస్ట్‌మన్‌గా విధులు నిర్వహించిన గాజుల భూమన్న ఉద్యోగ విరమణ సభ ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఆయనను పలువురు నాయకులు సన్మానించారు.